సాక్షి
కాకినాడ

శనివారం । 19 । అక్టోబర్ । 2024



జొన్నాడలో జోరేదీ!

8లో


216 ఏ జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. హైవే అథారిటీ అధికారుల ఉదాసీనతతో ఈ దుస్థితి దాపురించింది.



రూ.2,02,232 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నల్లం పరశురామ్ కుటుంబం (కాకినాడ) శుక్రవారం తన తల్లిదండ్రులు బాలకృష్ణరావు, లక్ష్మ నరసమ్మ పేరున రూ.2,02,232 విరాళం అందజేశారు.

55 వేల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 55,862 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 7,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కడలి కౌగిలి



సముద్ర కోతకు నిలువెత్తు సాక్ష్యంగా శిథిలమైన ఉప్పాడ వాసుల గృహాలు

- వందేళ్లుగా ఉప్పాడను కబళిస్తున్న సముద్రం
- తప్పని తుపాన్ల ముప్పు
- శాశ్వత రక్షణ చర్యలు శూన్యం
- ప్రకృతి వైపరీత్యాలతో మాయమవుతున్న తీరం

కడలికి కోపమొచ్చిందా అన్నట్లు ఉప్పాడలో సాగరం ఉగ్రరూపం దాల్చుతుంటుంది. తుపాను రానక్కరలేదు ఉపద్రవ హెచ్చరికలు అంతకంటే ఉండవు కానీ సముద్ర కెరటాలు ఒక్కసారిగా ఉప్పొంగుతుంటాయి. తీరం కోతకు గురవుతూ ఉప్పాడ, దాని శివారు గ్రామాలు కడలిలో కలిసి పోతుంటాయి. ఇలా సుమారు 100 సంవత్సరాలుగా కడలి కబళించేస్తున్నా శాశ్వత రక్షణ చర్యలు మాత్రం కనిపించడం లేదు. ఇక్కడ ఉన్నవి గుడిసెలే కదా అని రూ.లక్షల్లో ఉన్న ప్రతిపాదనలను పట్టించుకోపోవడం వల్ల రూ.వేల కోట్ల విలువైన వందల ఎకరాల పంటభూములు, విలువైన పురాతన ఆలయాలు, భవంతులు కడలి గర్భంలో కలసిపోయాయి.

పిఠాపురం: వందేళ్లుగా ఉప్పాడలో తీరం కోతకు గురవుతూనే ఉంది. కాకినాడ - విశాఖ మధ్య పారిశ్రామికాభివృద్ధికి మూలస్తంభం లాంటి బీచ్‌రోడ్డు నిర్మించిన నాటి నుంచి కడలి పాలవుతూనే ఉంది. ఇప్పుడు ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుండడంతో రక్షణ చర్యలు తప్పనిసరి అయ్యాయి. 1950లోనే ఉప్పాడ తీరానికి సముద్ర కోత వల్ల ముప్పు ఉందని అధికారులు గుర్తించారు. రక్షణ చర్యలు తీసుకోక పోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదని సర్వే జరిపిన విశాఖ ఆంధ్రా యూనివర్శిటీ శాస్త్రవేత్తల బృందం తేల్చిచెప్పింది. 1971లో కోత తీవ్రతను గుర్తించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1992లో పూనే లోని అప్పటి పీడబ్ల్యూ ఆర్‌ఎస్ డైరెక్టర్ సీవీ గోలే అధ్యక్షతన ఒక సాంకేతిక సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ బృందం సాంకేతిక పరంగా సర్వేలు జరిపి ఉప్పాడ ప్రాంతం కోత విశేష స్వభావం కలిగినదిగా అభివర్ణించింది. కాకినాడ నుంచి తుని వరకు తీర ప్రాంతాన్ని కలుపుతూ 1978లో నిర్మించిన బీచ్‌రోడ్డు ఇప్పటి వరకు 28 సార్లు సముద్రకోతకు గురయ్యింది. నాలుగు సార్లు రోడ్డు మొత్తం కొట్టుకుపోగా కొత్తగా దాని పక్కనే కొత్త రోడ్డు నిర్మిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తుపాన్లకు ఛిద్రమవుతున్న రోడ్డు రక్షణకు మరమ్మతులకు రోడ్లు భవనాల శాఖ రూ.1,500 కోట్ల వరకు వెచ్చించినట్టు అంచనా.

ఇప్పటి వరకు వచ్చిన తుపానులు

2004 అగ్ని, 2006 ఆకాష్, 2008 బిజిలి, 2010 జల్, 2013 లెహర్, 2014 హుద్‌హుద్, నీలం, లైలా, పైలిన్,హెలెన్, మెగా, సాగర్, వాయు, పెథాయ్, తిత్లీ, వంటి 60 తుపాన్లు 60 ఏళ్లలో రాగా వాటిలో ఒక సునామీ, కొన్ని తుపాన్లు ఉప్పాడ సాగరతీరాన్ని తీవ్ర కోతకు గురి చేశాయి. సాధారణ సమయాల్లోనూ ఇక్కడ సముద్ర కోత కొనసాగుతోంది.

2015లో నిర్వహించిన 8వ ఇంటర్‌నేషనల్ కాన్ఫరెన్సు ఏషియన్ అండ్ ఫసిఫిక్ కోస్టు సర్వే లెక్కల ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో 1990 నుంచి 2000 సంవత్సరం వరకు 57.92 కిలోమీటర్లు, 2000 నుంచి 2006 వరకు 102.88 కిలోమీటర్లు, 2006 నుంచి 2012 వరకు 77.58 కిలోమీటర్లు తీర ప్రాంతం కోతకు గురైనట్లు తేల్చగా దానిలో ఎక్కువ భూభాగం ఉప్పాడ తీరంలోనే సముద్రంలో కలిసినట్లు చెబుతున్నారు.

ఉప్పాడ గ్రామం విస్తీర్ణం - 342.5 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉండేది. కాని గత వందేళ్లుగా సుమారు 320 ఎకరాల భూమి కోతకు గురై సముద్రంలో కలిసిపోయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఉప్పాడ గ్రామానికి సంబంధించి సుమారు

2011 లెక్కల ప్రకారం

ఉప్పాడలో గృహాలు	: 3190
జనాభా	: 12,963
గ్రామంలో కోతకు గురైన భూభాగం : సుమారు 320 ఎకరాలు	
దెబ్బతిన్న ఇళ్లు	: సుమారు 2,300
కోల్పోయిన విలువైన ఆస్తులు : 2 ప్రాచీన ఆలయాలు, 3 ట్రావెలర్స్ బంగళాలు, పాగారబెట్టే షెడ్లు, ఇతర ప్రభుత్వ స్థలాలు.	



సముద్రకోతకు గురవుతున్న ఉప్పాడ గ్రామం

410 ఎకరాల పంట భూములు సరుగుడు తోటలు ఇతర పంట పొలాలు గతంలో ఉండగా సుమారు 320 ఎకరాల భూములు సముద్రంలో కలిసి పోవడంతో ప్రస్తుతం అధికారికంగా 80 ఎకరాల పంట భూములు మాత్రమే మిగిలి ఉన్నాయి. కోనపాపపేట గ్రామంలో గత 10 ఏళ్లగా (ఉప్పాడలో జియోట్యూబ్ రక్షణ గోడ నిర్మించినప్పటి నుంచి) సుమారు 20 ఎకరాల విస్తీర్ణం సముద్రంలో కలిసిపోయింది. సుమారు 150 గృహాలు కోతకు గురయ్యాయి. ప్రతీ తుపాను సమయంలోను ఈ గ్రామం కోతకు గురవుతోంది.

కోతకు కారణమేమిటంటే...

గోదావరి ఇసుక కొట్టుకు రావడం వల్ల కాకినాడ సమీపంలో ఏర్పడిన హోప్‌ఐలాండ్ కారణంగానే ఉప్పాడ ప్రాంతం కోతకు గురవుతోందని నిపుణులు తేల్చి చెప్పారు. ఈ ఐలాండ్ సముద్రంలో 40 చదరపు మైళ్ల విస్తీర్ణం గల లోతు లేని అగాధం (కాకినాడ బే) సృష్టించడం వల్ల దీని సమీపంలో ఉన్న ఉప్పాడకు ముప్పు ఉందని నిర్ధారించారు. ఉత్తరం వైపు నుంచి తెరచుకుని ఉండే ఈ అగాధం దక్షిణ వైపు నుంచి తీరానికి వెళ్లే అలలను అడ్డుకొనడం వల్ల అలలు అగాధాన్ని దాటి వెళ్లలేక పోతున్నాయి. దీంతో అలలతో పాటు వెళ్లే పదార్థాలు (లిట్టోకల్ డ్రిఫ్ట్) తీరం చేరడం లేదు. దానివల్ల అలల తాకిడితో హోప్‌ఐలాండ్‌లో ఇసుక దిబ్బలు పెరుగు తుండగా ఉప్పాడ తీరంలో ఇసుకమేటలు వేయడానికి బదులు తీరంలో మట్టి కోతకు గురవుతోందని ఈ కమిటీ నిర్ధారించింది.

నివారణకు అప్పట్లోనే ప్రతిపాదనలు

కోతకు గురవుతున్న ప్రాంతంలో ఇసుక వేయాలని అప్పట్లో బీచ్ ఎరోజన్ బోర్డు సూచించింది. నదీ ప్రాంతాల నుంచి ఏటా 1.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తెచ్చి తీరంలో నింపాలని సిఫారసు చేసింది. తద్వారా అలల తాకిడికి ఇసుక కోతకు గురవుతూ తిరిగి అదే ఇసుక మేటలు వేస్తుందని అధికారులు సూచించారు. అయితే ఏటా ఇసుక తరలించడానికి అయ్యే ఖర్చు ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో అప్పట్లో ఈ నిర్ణయాన్ని పక్కన పడేశారు. ఆ పద్ధతి సాధ్యం కాకపోతే సీవాల్స్ నిర్మించమని 1975 ఫిబ్రవరి 12న జరిగిన బీచ్ ఎరోజన్ బోర్డు సమావేశంలో మరో ప్రతిపాదన కూడా చేశారు. ఆ ప్రతిపాదన సాధ్యమయ్యే అవకాశం ఉండడంతో 1982లో రూ.31.86 లక్షల **వ్యయంతో సీవాల్స్ నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ ప్రణాళికలను రాష్ట్ర వరద నివారణ బోర్డుకు చెందిన సాంకేతిక సంఘం పరిశీలించి 1982 జూలై 22న ఆమోదించింది. కాకినాడలో డీప్‌వాటర్ పోర్టు కోసం తవ్వుతున్న కాల్వ లోని మట్టిని కోతకు గురవుతున్న ప్రాంతంలో కొద్ది దూరంలో వేయాలని పీడబ్ల్యూ ఆర్‌ఎస్ సంస్థ 1991లో మరో ప్రతిపాదన చేసింది. ఆ మట్టిని వెయ్యి మీటర్ల వెడల్పున, 2500 మీటర్ల పొడవునా పది మీటర్ల ఎత్తున గుట్టగా** పోయాలని సలహా ఇచ్చింది. 120 లక్షల ఘనపు మీటర్ల మట్టిని ఉప్పాడ తీరానికి దగ్గర్లో పోగు చేస్తే ఆ మట్టి కెరటాల ద్వారా కరిగి తీరంలో మేట వేస్తుందని సూచించింది. అయితే కొంతమేర అప్పట్లో మట్టి వేసినా ఒక్క ఇసుక రేణువు కూడా తీరానికి చేరలేదనేది పోర్టు అధికారుల వాదన.

రూ.లక్షలతో మొదలై రూ.కోట్లకు చేరుకున్న ప్రతిపాదనలు

వెయ్యి మీటర్ల పొడవునా గోడ నిర్మాణానికి రూపొందించిన ప్రతిపాదనలు 1982లో రూ.31.86 లక్షల వ్యయం కాగా, 1994–95 సంవత్సరానికి అప్పటి ధరల ప్రకారం రూ.1.25 కోట్లకు చేరుకున్నాయి. మరో ఏడాదిలోనే రూ.2.25 కోట్లకు ఇప్పుడు రూ.1,000 కోట్లకు చేరువుగా పెరిగాయి.

రక్షించకపోతే మా గ్రామం కనుమరుగే



ఎన్నో ఏళ్లుగా మా గ్రామం కోతకు గురవుతూనే ఉంది. మా కళ్లముందే మా గ్రామం కనుమరుగవుతున్నా ఏమి చేయలేని పరిస్థితి మాది. మా చిన్నప్పుడు మా ఊరికి కనిపించనంత దూరంలో సముద్రం ఉండేది. ఇప్పుడు మా గ్రామం కనిపించనంతగా ముందుకు వచ్చేసింది. ఇప్పటికైనా రక్షణ చర్యలు తీసుకోపోతే ఇక మా గ్రామం ఇండియా మ్యాప్‌లో లేకుండా పోతుంది. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్న తీర ప్రాంతానికి వెన్నెముక అయిన ఉప్పాడను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఉమ్మిడి జాన్, మాజీ సర్పంచ్, ఉప్పాడ.

న్యూస్‌రీల్

సత్యదేవునికి వెండి శంఖం సమర్పణ



దాతలు సమర్పించిన వెండి శంఖం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన బొడ్ల వెంకట రామ నరసయ్య దంపతులు 337 గ్రాముల వెండితో చేయించిన వెండి శంఖాన్ని శుక్రవారం అందజేశారు. ఈ శంఖం తయారీకి రూ.37 వేలు వ్యయమైందని వారు తెలిపారు. ఈ శంఖాన్ని స్వామివారి పూజా కైంకర్యాలలో ఉపయోగించాలని దాత కోరినట్టు దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ కంచిబట్ల రాంబాబు తెలిపారు.

సామర్లకోట రైల్వే స్టేషన్‌కు స్వచ్ఛత పురస్కారం



డీఆర్‌ఎం నుంచి పురస్కారం అందుకున్న చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌కు స్వచ్ఛత పురస్కార్ అవార్డు లభించింది. గత నెల 16 నుంచి 30 వరకు స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలు, ఈ నెల ఒకటి నుంచి 15 వరకు స్వచ్ఛ పఖ్వాడ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంతో అవార్డు లభించిందని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం విజయవాడలో దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజరు నరేంద్ర ఎ పాటిల్ నుంచి స్థానిక రైల్వే చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి అవార్డు అందుకున్నారని తెలిపారు. ఈ అవార్డు రావడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ అవార్డు రావడానికి కారకులైన అధికారులందరికి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది సమస్యలపై వినతి

కాకినాడ సిటీ: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో 17 ఏళ్లుగా ఫీల్డ్‌లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎన్టీయార్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని ఇన్సూరెన్స్ విధానంలోకి మార్పు చేసినా పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బంది 17 సంవత్సరాల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఫీల్డ్ సిబ్బంది అందరికి పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ట్రస్ట్ ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన వన్‌టైం ఎగ్జామ్‌ని ఉపసంహరించుకోవాలని, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి అందరికీ అంతర్గత ప్రమోషన్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన సిబ్బందికి రూ. 15 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, రిటైర్డ్‌మెంట్ అయిన, అవుతున్న సిబ్బందికి రూ.10 లక్షలు గ్రాట్యూటీ ఇవ్వాలన్న డిమాండ్లతో కోఆర్డినేటర్‌కు వినతి పత్రం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వనచర్ల వీరభద్రరావు విలేకరులకు తెలిపారు. అసోసియేషన్ నాయకులు యమన కృష్ణ, కిషోర్‌బాబు, అనిల్‌కుమార్, కె బుజ్జీ, కె రాజు, గీసాల శ్రీను పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ముమ్మిడివరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం: పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తించడం లేదని ఉమ్మడి గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరని 3, 4, 5 తరగతులను విలీనం చేశారు తప్ప బోధనలకు స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు ఎంఈఓ పోస్టులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై దృష్టి సారించాలి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేటి యువత, అధ్యాపకులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) గురించి ఆలోచించాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో ఇండస్ట్రీ 4.0 అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజానికి అవసరాలే ముఖ్యంగా ఉండే సాఫ్ట్‌వేర్ రూపొందించాలని, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ద్వారా మానవునికి భవిష్యత్తులో సంభవించే ఆరోగ్య పరమైన సమస్యలు వైద్యులు గుర్తిస్తారన్నారు. ప్రస్తుత యువత సీఎస్‌ఈ వైపే మొగ్గు చూపుతున్నారని, వర్క్‌షాపునకు ఆఫ్ స్కిల్ సహకారం అందించడం సంతోషమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యపై అధిక దృష్టి కేంద్రీకరించి వినూత్న కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వ్యవస్థాపకులుగా, వినూత్న అవిష్కరణలు చేపట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లను నిబద్ధతతో ఎదుర్కొని విజయం సాధించాలన్నారు. రెక్టార్ కేవీ రమణ మాట్లాడుతూ విద్యార్థి దశలో లభించే అవకాశాల గురించి యువతకు తెలియదని, అవకాశాలు అందిపుచ్చుకుంటే విజయం దానంతట అదే వస్తుందన్నారు. పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించి వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలు చేపట్టేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, రిసోర్స్‌పర్సన్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ మోహనరావు, సీఎస్‌ఈ ఇన్‌చార్జి విభాగాధిపతి కరుణ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో జన సురక్ష

కలెక్టర్ షణ్మోహన్



జన సురక్ష కార్యక్రమాల అమలు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ సిటీ: జిల్లాలో రానున్న మూడు నెలల పాటు గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న జన సురక్ష కార్యక్రమాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రయోజనకరమైన కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలలో నమోదు పొందేలా చూడాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి బ్యాంకర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం వివరాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ సూచన మేరకు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనపై ఈ నెల 15వ తేదీ నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అవగాహన, నమోదు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని బ్యాంకులు, జిల్లా అధికారులను కోరారు. దేశ ప్రజలకు జీవిత బీమా యోజనను, ప్రధానమంత్రి బీమా భద్రత కల్పిస్తూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను ప్రధానమంత్రి 2015లో ప్రారంభించారన్నారు. ఏడాదికి కేవలం 436 రూపాయల ప్రీమియంతో ప్రమాద బీమాల కింద రూ.2 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్‌ను నమోదు చేసుకున్న వారికి అందిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ జీవన్‌జ్యోతి బీమా యోజనలో 9 కోట్ల 29 లక్షల మంది, సురక్షా బీమా యోజనలో 32 కోట్ల 7 లక్షల మంది నమోదు పొందారన్నారు. అత్యంత ప్రయోజనకరమైన ఈ పథకాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రజలు మరింత ఎక్కువ సంఖ్యలో చేరి లబ్ధి పొందేలా ప్రజా అవగాహన, చైతన్యం పెంపొందించేందుకు రానున్న మూడు నెలల పాటు జన సురక్ష కార్యక్రమాలను గ్రామస్థాయిలో ముమ్మరంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా దేశంలో 2024–25 సంవత్సరానికి జీవన్ జ్యోతి బీమా పథకంలో మరో 13 కోట్ల 9 లక్షల మందిని, సురక్షా బీమా పథకంలో మరో 37 కోట్ల 70 లక్షల మందిని నమోదు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా చేపట్టిందని కలెక్టర్ షణ్మోహన్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో రానున్న మూడు నెలల పాటు జన సురక్షా కార్యక్రమాలను ఉద్యమ స్థాయిలో నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ బీమా పథకాల్లో నమోదు పొందేలా చైతన్య పరచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని బ్యాంకులు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలతో పాటు గ్రామస్థాయిలో సేవా వ్యవస్థ కలిగిన వ్యవసాయం, పశుసంవర్ధన, మత్స్య తదితర అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామసర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బంది, బ్యాంక్ కరస్పాండెంట్, పోస్టల్ సిబ్బంది చురుగ్గా పాల్గొని జనసురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, ఎల్డీఎం ప్రసాద్, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశస్త్‌మైన భవితకు..

- విద్యార్థుల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్
- 21 లోపాల గుర్తింపులో ఉపయుక్తం
- రెండు విభాగాలుగా యాప్ విభజన
- మొదటి దశలో గుర్తింపు, రెండో దశలో నిర్ధారణ
- అనంతరం తగిన వైద్యానికి సిఫారసు



ప్రశస్త్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న ఉపాధ్యాయులు

రాయవరం: విద్యార్థుల్లో పలువురికి శారీరక, మానసిక సమస్యలుంటాయి. మరికొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఇటువంటి వారిని గుర్తించడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ‘ప్రశస్త్’ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. ఉపాధ్యాయులే విద్యార్థులను పరిశీలించి వారిలోని లోపాలను ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఉపాధ్యాయుని పేరు, ట్రెజరీ ఐడీ, మెయిల్ ఐడీ, సెల్ నంబరు, యూడైస్ కోడ్‌తో ప్రశస్త్ యాప్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంది. అనంతరం యాప్‌లో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

21 రకాల లోపాల గుర్తింపునకు..

వైకల్యాలు ఉన్న పిల్లలను ధ్రువీకరించడం, స్క్రీనింగ్‌లో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మెరుగుపర్చడం, అశాస్త్రీయ నిర్ధారణ, లేబులింగ్ నుంచి రక్షణ, పిల్లల పరిస్థితి గురించి స్పష్టతను సులభతరం చేయడం, వైకల్యం ఉన్న విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడం దీని ముఖ్య ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల సామర్థ్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల్లో చదవడం, వినడం, మాట్లాడడంతో పాటు చెప్పిన పదాన్ని పదే పదే చెప్పమనడం, రోజువారీ పనులు సొంతంగా చేసుకోలేక పోవడం, అనుమతి లేకుండా తరగతి నుంచి వెళ్లడం, నెమ్మదిగా చదవడం, రాయడం, స్పష్టతలేని చేతిరాత, రివర్స్‌గా రాయడం, గణిత చిహ్నాలు అర్థం చేసుకోలేక పోవడంలో ఇబ్బంది పడడం, పునరావృత ప్రదర్శనలో ఇబ్బందులు, ఆసక్తిగా లేక పోవడం, చెప్పిందే చెబుతూ ప్రతిస్పందించడం, విచారంగా కనిపించడం, ఇతర విద్యార్థులతో పోలిస్తే సులభంగా అలసి పోవడం తదితర 21 రకాల లోపాల్లో దేనితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారో ఉపాధ్యాయులు తమ ప్రత్యక్ష పరిశీలనతో నమోదు చేస్తారు.

రెండు విభాగాలుగా

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను నమోదు చేసే ప్రశస్త్ యాప్‌ను రెండు భాగాలుగా విభజించారు. ఇందులో పొందుపర్చినట్టుగా ఉపాధ్యాయులు విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. మరికొన్నింటిని వారే విద్యార్థిని నిశితంగా పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది. యాప్‌లో 63 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపర్చాల్సి ఉంటుంది. పార్ట్-1లో లోపాలు గుర్తిస్తే, పార్ట్-2లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల లోపాలను ఉపాధ్యాయులు పరిశీలించి నిర్ధారించి వైద్యులకు సిఫార్సు చేస్తారు.

సత్వర చర్యలు చేపట్టాం



ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వందశాతం నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల వివరాలను త్వరగా నమోదు చేసేందుకు ఆదేశాలు ఇచ్చాం. నమోదు వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

– ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

స్క్రీనింగ్ ముఖ్యమైనది



ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థులను స్క్రీనింగ్ చేయడం ముఖ్యమైన అంశం. అభ్యసనంలో ఉన్న విద్యార్థులకు ఉన్న ఇబ్బందులను గుర్తించి సవరించేందుకు ప్రశస్త్ ఉపకరిస్తుంది. ఉపాధ్యాయులందరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్థులందరినీ సాధ్యమైనంత తొందరగా స్క్రీనింగ్ చేయాలి.

– ఎ.మధుసూదనరావు, డిప్యూటీ కలెక్టర్ మరియు అదనపు జిల్లా కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

ఏకే మల్లవరంలో ఇరువర్గాల మధ్య వివాదం

ప్రార్థనా మందిరం నిర్వాహకుడిపై స్థానికుల ఫిర్యాదు



ఘటనా స్థలం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసులు

పిఠాపురం: ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారని ఒక మత బోధకుడిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఆందోళనకు దిగడంతో గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో శుక్రవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏకే మల్లవరంలో ఒక మత బోధకుడు తన ప్రార్థనా మందిరం చుట్టుపక్కల ఏర్పాటు చేసిన ఇతర మతానికి చెందిన ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు జనావాసాల మధ్య ఉన్న ప్రార్థనా మందిరంలో తన భార్య మృతదేహాన్ని ఖననం చేయడంపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తూ అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోవడంలేదంటూ శుక్రవారం గ్రామంలో ఆందోళనకు దిగారు. మరో వైపు మతబోధకుడి వర్గం ఆందోళనకు సిద్ధం కావడంతో తహసీల్దారు సత్యనారాయణ, సీఐ శ్రీనివాస్ ఎస్సై రామకృష్ణ, గ్రామ కార్యదర్శి రాజు ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలతో చర్చలు జరిపారు. తొలగించిన ఫ్లెక్సీలను, బల్లలను యథావిధిగా ఏర్పాటు చేయడంతో పాటు శాంతి కమిటీని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

20 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందిని కోర్టు ముందు హాజరు పరిచినట్టు ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపినందుకు 18 మందికి ఒక్కొక్కరికీ రూ.ఐదు వేల చొప్పున, మరొక ఇద్దరికీ 1500 చొప్పున మొత్తం రూ.93 వేలు కోర్టు జరిమానా విధించింది. ఈ నెల ఇప్పటి వరకు 172 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు బుక్ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

మహిళకు ఏడాది జైలు

రూ.11 లక్షల నష్ట పరిహారం విధింపు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన మహిళకి ఏడాది జైలు, రూ.11 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ ఆర్ఆర్ నగర్‌కు చెందిన తేతలి రామ చంద్రారెడ్డి వద్ద నుంచి కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట చెందిన బేవర రామ విజయలక్ష్మి 2020లో రూ.6.5 లక్షల అప్పు తీసుకున్నారు. బాకీ తీర్చేందుకు 2021లో రూ.11 లక్షలకు చెక్కు ఇచ్చారు. చెక్కును రామచంద్రారెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారణలో రామ విజయలక్ష్మిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.11 లక్షల పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.

జొన్నాడలో జోరేదీ!


ఫ్లైఓవర్ అప్రోచ్ రోడ్డులో పెరిగిపోయిన గడ్డి, తుప్పలు


జొన్నాడ సెంటర్‌లో అసంపూర్తిగా పిల్లర్ల నిర్మాణం

- ఫ్లైఓవర్ నిర్మాణంలో అడుగడుగునా జాప్యం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న హైవే అథారిటీ
- దీనితో మొదలైన మోరంపూడి ఫ్లైఓవర్‌పై ఇప్పటికే పరుగులు తీస్తున్న వాహనాలు
- పనులు వేగవంతం చేయాలంటున్న స్థానికులు

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియంత్రణకు ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వరకూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రూ.300 కోట్లతో ఐదు ఫ్లైఓవర్లు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో 2019 జనవరి 21న అప్పటి కేంద్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆ పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అంతేగాక నాలుగేళ్ల వ్యవధిలో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కొద్ది నెలల విరామం అనంతరం రాజమహేంద్రవరం (మోరంపూడి), జొన్నాడ, తణుకు, తేతలి, కైకరంలో ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు దశల వారీగా ప్రారంభమయ్యాయి. మోరంపూడి, జొన్నాడల్లో నిర్మాణ పనులు సెప్టెంబర్ 22న 2022న ఒకేసారి మొదలు కాగా మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికావడం, గత నెల 8న ప్రారంభోత్సవం జరుపుకోవడం జరిగిపోయాయి. జొన్నాడలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. అలాగే తణుకు ఫ్లైఓవర్ పనులు సైతం తుది దశకు చేరుకోగా తేతలి, కైకరంలో పనులు వివిధ దశల్లో ఉన్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు. జొన్నాడ ఫ్లైఓవర్ అప్రోచ్ రోడ్లు అర్థాంతరంగా నిలిచిపోగా పిల్లర్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లోని రెండు ఫ్లైఓవర్ల పనులు ఒకేసారి ప్రారంభించినా పనులు జొన్నాడలో పనుల జాప్యానికి కారణమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కూడలిలో అన్నీ అవస్థలే

రెండేళ్లుగా ఫ్లైఓవర్ పనులు సాగుతుండడంతో జొన్నాడ బస్టాండ్ కూడలిలో ప్రయాణికులు, పాదచారులు పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట, కె.గంగవరం మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్న జొన్నాడ సెంటర్‌లో నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరు వైపులా రహదారులకు మార్జిన్ లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల ఆర్టీసీ బస్సులు ఎక్కడ ఆపాలో తెలియని పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అలాగే నిర్మాణ పనులు ఒక పద్ధతి ప్రకారం జరగకపోవడంతో కొద్దిపాటి వర్షానికే ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారుతోంది. దీంతో వాహన చోదకులు ఆ బురదలో జారిపడి ప్రమాదాల పాలవుతున్నారు. అప్రోచ్ రోడ్డుకు అమర్చే గడ్డర్లు ఎక్కడపడితే అక్కడ పడేయడంతో నిర్మాణ ప్రాంతం చిట్టడివిని తలపిస్తుంది. ఫ్లై ఓవర్ పనులు ప్రారంభించినప్పటి నుంచి ఇరువైపుల మార్గాల్లోని బస్టాండుల్లో ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఎన్‌హెచ్ఏఐ ఉదాసీన వైఖరి

ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఉదాసీన వైఖరిని అవలంబిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇకనైనా అధికారులు పనులను వేగవంతం చేసి, ప్రయాణికులకు తగిన సౌకర్యాలను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అపరిశుభ్రంగా ఉన్న కూడలిని అన్ని విధాలా తాత్కాలికంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి

ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేసేలా ఎంపీ, ఎమ్మెల్యేలు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణం రెండేళ్లుగా సాగుతోంది. దీనిని త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీలైనంత త్వరగా ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రమాదాలు నివారించాలి.

– కట్టా శ్రీనివాసు, సర్పంచ్, జొన్నాడ

శతాధిక వృద్ధురాలి మృతి


సత్తెమ్మ (ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు బీర మేను సత్తెమ్మ (115) శుక్రవారం వయోభారంతో మృతి చెందింది. సత్తెమ్మకు ఐదుగురు కుమార్తెలు ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే 25 మంది మనుమలు, మనవరాళ్లు, 30 మంది మునిమనుమలు, ముని మనవరాళ్లు ఉన్నారు. వీరిలో కొందరికి పెళ్లిళ్లు జరిగి పిల్లలు ఉన్నారు. వృద్ధాప్యంలోనూ ఏ విధమైన అనారోగ్య సమస్యలు లేకుండా తిరిగేదని కుటుంబీకులు గ్రామస్తులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో..


సుందరపల్లి నాగ వెంకట శేషాద్రి

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం ఠాణేల్లంకలో విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. ఠాణేల్లంకకు చెందిన సుందరపల్లి నాగ వెంకట శేషాద్రి(50) తన ఇంట్లో ఫ్రిజ్ రిపేర్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. శేషాద్రిని ముమ్మిడివరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శేషాద్రికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా స్ఫూర్తితో పోటీపడండి


అండర్-14 బాలికల విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

- క్రీడాకారులకు కలెక్టర్ షణ్మోహన్ పిలుపు
- అట్టహాసంగా ఎస్‌జీఎఫ్ఐ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీల ప్రారంభం
- 13 జిల్లాల నుంచి 460 మంది హాజరు


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): క్రీడా స్ఫూర్తితో పోటీ పడి రాణించాలని కలెక్టర్ షణ్మోహన్ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడలోని వైఎస్సార్ మున్సిపల్ స్కేటింగ్ రింక్‌లో 68వ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ఐ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ పి.రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారుల మధ్య ఇటువంటి పోటీలు స్నేహ బంధాలను ఏర్పరుస్తాయని అన్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించి తమ తమ జిల్లాలకు పేరు తేవాలన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లాలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు అవసరమైన స్థలం అందించాలని కలెక్టర్ షణ్మోహన్‌ను కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. డీఈఓ రమేష్ మాట్లాడుతూ ఈ నెల 20 వరకు జరిగే ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 460 మంది క్రీడాకారులు హాజరుకావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. అనంతరం కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడా జ్యోతిని ఎమ్మెల్యే నానాజీ, కలెక్టర్ షణ్మోహన్ వెలిగించి క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి జార్జి, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, టోర్నమెంట్ పరిశీలకులు ఎస్.దిలీప్, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సంయుక్త కార్యదర్శి సునీల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి కౌర్, పీడీలు బంగార్రాజు, నూకరాజు, హరిబాబు, సూరిబాబు, నాగమణి, త్రిపుల, కోచ్‌లు మేనేజర్లు, హరీష్ స్పోర్ట్స్ నిర్వాహకులు హరీష్ పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

తొలిరోజు రింక్-1, 500 మీటర్ల విభాగంలో అండర్-11, 14, 17, 19 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి. అండర్-11 బాలికల విభాగంలో సి.టి.తన్మయి (గుంటూరు), మోస అనికసుసాన్ (తూర్పు గోదావరి), ఆకుల కావ్య శ్రీ (తూర్పు గోదావరి), బాలుర విభాగంలో విరోహిత్ రిషీశ్వర్ (తూర్పు గోదావరి), కరణం జయ చందన్(విశాఖ), కోనాల వర్షిత్ (తూర్పుగోదావరి) బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. అండర్-14 బాలికల విభాగంలో ఏ.ఆద్విక రమ్య (నెల్లూరు), వి.తనూజ సాయి (కృష్ణ), హర్షిక ఉంగరాల (తూర్పు గోదావరి), బాలుర విభాగంలో నెల్లూరి నిఖిల్ ఈశ్వర్ (తూర్పు గోదావరి), కె.వి ఘ్నేష్ (కృష్ణ), కెజిఎస్ఎస్ సాయిరాం (తూర్పు గోదావరి) స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. అండర్-17 బాలికల విభాగంలో వడిగల వీర వర్షిణి (తూర్పు గోదావరి), విద్యా ప్రజాపతి (విశాఖ), ఎస్.జశ్మిత (నెల్లూరు), పి.జాన్సన్ (విశాఖ), అముజూరి లోహిత (విశాఖ), కోట లిఖిత్(తూర్పు గోదావరి), అండర్-19 బాలికల విభాగంలో కె.స్నేహకృతి (చిత్తూరు), వి.జాహ్నవి ప్రభ (కృష్ణ), సీహెచ్ మౌనిక దివ్య శ్రీ (పశ్చిమ గోదావరి), బాలుర విభాగంలో కె.శ్రీఖిద్యాన్ (చిత్తూరు), ఆర్.జశ్వంత్ (కృష్ణ), కుసుమ అర్జున్ (తూర్పు గోదావరి) స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవశం చేసుకున్నారని టోర్నమెంట్ పరిశీలకులు దిలీప్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పోటీలను ఎస్‌జీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి జార్జి, సంయుక్త కార్యదర్శి సునీల్ పర్యవేక్షించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

TO-LET

Commerical Space for rent బ్యాంక్‌లకు, హాస్పిటల్‌లకు ఫైనాన్స్, ఆఫీస్‌లకు అనుకూలం, లక్ష్మీవరపుపేట, రాజమండ్రి. సంప్ర: 9600081055, 9849947123 [C-800008]

Services

బంగారం బ్యాంకులలో లేదా ప్రైవేట్ సంస్థలో తాకట్టులో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. మార్కెట్ ధరపై 100 తగ్గించి, 2.5%తో (Exchange) చేయబడును. వేరే ఇతర ఛార్జీలు వర్తించవు. ✆ : 89778 07697 S [R-6872]

రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ రేటు, సిబిల్ అవసరం లేదు. NPA కూడ దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను.అర్చన్‌ఫైనాన్స్,పార్తిబా. 8500236824. [T-282]

GOLD FINANCE



బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 G [B-2567]

Wanted

రాజమండ్రి, కేశవరంలో ప్ర॥ కం॥, షోరూమ్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్స్, లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. జీ॥ 12 నుండి 15 వేలు. రూం + భో. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. 93922 69369 [R-800]

కష్టమైనప్పుడే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995984445 [HA-98759]

విజయవాడలో VIP పేషెంట్‌లను ఇంట్లోనే ఉండి చూసుకొనుటకు ICU ఎక్స్‌పీరియన్స్‌డ్ GNM, B.Sc నర్సింగ్ వాళ్ళు కావలెను. జీతం 25K-35K కాల్/వాట్సాప్ ✆ 97050 35559, 91600 25559 [B-294]

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185482]

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ : 18K. Ph: 8520980099 [SCA24000403]

TECHNICIANS RESIDENTIAL 10th/Inter For Maruti Fire Services in Rajahmundry send resume 9440477249 / 9440451249 marutifireservices@yahoo.co.in [SCA24000419]

Wanted Male Marketing Incharge, Cashier, Computer Operator, Class Incharges Qualification Any Degree. Age Limit: 25-45 years. Salary: 15000/- to 25000/- Location: Rajahmundry. Contact: 92487 33370 [G-5714]

తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు, శంకరాపురంలోని మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో దివ్యాంగులకు సేవచేయుటకు హెల్పర్స్ కావలెను.జీ:12,000/- వంట సహాయకులు జీతం 12,000/- ఉచిత భోజన వసతి కలదు. సంప్రదించండి :94933 08199, 94409 42148. [P-3122]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు


పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయనున్న పశ్చిమ రాజగోపురం ఎదుట స్థలం


దేవస్థానంలో భద్రతపై పోలీసులు, హోం గార్డులకు ఆదేశాలిస్తున్న సీఐ సూరి అప్పారావు

- రత్నగిరిపై సీఐ సూరి అప్పారావు తనిఖీలు
- పశ్చిమ రాజగోపురం వద్ద పోలీస్ ఔట్‌పోస్టుకు ప్రతిపాదన

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: భక్తుల ముసుగులో రత్నగిరిపై చోరీలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సూరి అప్పారావు తెలిపారు. శుక్రవారం 'కొండెక్కి సం 'చోరీ'స్తూ'శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి దేవస్థానంలో పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ శ్రీహరిబాబు, ఇతర పోలీసులు, దేవస్థానంలో విధుల్లో ఉన్న హోమ్‌గార్డులతో సమావేశమయ్యారు. దేవస్థానంలో ఎక్కువ రోజులుగా ఉంటున్న వారి వివరాలు, ఆధార్ కార్డులు పరిశీలించాలని ఆదేశించారు. అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు.

పశ్చిమ రాజగోపురం ఎదురుగా పోలీస్ ఔట్‌పోస్టు

కాగా, ప్రస్తుతం పోలీస్ ఔట్‌పోస్టు సీతారామ సత్రంలో దేవస్థానానికి దూరంగా ఉన్నందున దానిని పశ్చిమ రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసేందుకు క్యాబిన్ కేటాయించాలని దేవస్థానం అధికారులను కోరనున్నట్లు ఎస్ఐ తెలిపారు. పశ్చిమ రాజగోపురం ద్వారానే దేవస్థానానికి 80 శాతం మంది భక్తులు రాకపోకలు సాగిస్తున్నందున అందరికీ ఔట్‌పోష్టు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

సత్రం గదుల ఫేక్ రశీదుపై ఫిర్యాదు

సత్రంలో గదులు రిజర్వ్ చేసినట్టుగా నకిలీ రశీదు ఇచ్చి రూ.8 వేలు తీసుకుని ఒక దళారీ చేసిన మోసంపై శుక్రవారం దేవస్థానం అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి పెళ్లి బృందం సభ్యులు సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయానికి వచ్చి తాము హరిహర సదన్ సత్రంలో నాలుగు రూమ్‌లు రిజర్వ్ చేసుకున్నామని చెప్పి రశీదు ఇవ్వడం, దానిలో సత్రం గదికి అద్దె రూ.950 చొప్పున రూ.3,800 ఉండడానికి బదులు రూ.ఎనిమిది వేలు చెల్లించినట్లు ఉన్న విషయం తెలిసిందే. అందులో రూ.వేయి జీఎస్‌టీ అని కూడా ఉంది. దీంతో అది ఫేక్ రశీదు అని అధికారులు ఆ విషయాన్ని పెళ్లి బృందానికి తెలియచేశారు. ఈ వ్యవహారంలో సిబ్బంది పాత్ర ఉందా అనే అనుమానం కొందరు వ్యక్తం చేస్తుండడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రత్నగిరిపై వర్షపు నీటి సమస్యకు చెక్


ధ్వజస్తంభం పైభాగంలో అమర్చిన అద్దం

రత్నగిరిపై అనివేటి మండపం సమీపంలోని స్వర్ణ ధ్వజస్తంభం వద్ద సత్యదేవుని వ్రతాలు ఆచరించే భక్తులకు వర్షపు నీటి సమస్య పరిష్కారమైంది. మూడు నెలల క్రితం అనివేటి మండపంలో దాత సహకారం రూ.3 కోట్లతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేసి దానికి స్వర్ణరేకు తాపడం చేశారు. ఈ పనుల్లో భాగంగా మండపంలో ధ్వజ స్తంభం పట్టేలా శ్లాబ్‌కు పెద్ద రంధ్రం చేశారు.

దిగువ నుంచి చూస్తే ధ్వజస్తంభం మీద గల కలశాలు కనిపించేలా, కార్తిక మాసంలో ధ్వజస్తంభం చివర ఆకాశదీపం పెట్టేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠ అనంతరం ఆ రంధ్రాన్ని అద్దాల పలకలతో మూసేశారు. ధ్వజ స్తంభం చుట్టూ కొంత గ్యాప్ ఉండడంతో అందులో నుంచి వర్షపునీరు కిందకు పడి ధ్వజస్తంభం తడవడంతో పాటు అనివేటి మండపంలో వ్రతాలాచరించే భక్తుల వద్దకు వర్షపు నీరు వచ్చేది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం దేవస్థానం ఈఈ రామకృష్ణ ఆధ్వర్యంలో ధ్వజస్తంభం పైభాగంలో ఉన్న గ్యాప్ నుంచి వర్షపునీరు కారకుండా గ్లాసు, స్పాంజితో పూత పూశారు. దీనిపై ఫైబర్‌తో గొడుగు వంటిది ఏర్పాటు చేస్తామని ఈఈ రామకృష్ణ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రంపయర్రంపాలెం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

గోకవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీల్లో మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పి.అనిల్ కుమార్ అండర్-17 విభాగంలో వాలీబాల్‌కు, తొమ్మిదో తరగతి విద్యార్థి బి.మనోహర్ అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయిని గంధం ప్రమీలారాణి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ విజయకుమార్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించి రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

జనవరిలో ప్రపంచ తెలుగు మహాసభలు



సమావేశంలో పాల్గొన్న జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు తదితరులు

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (గైట్ క్యాంపస్)లో వచ్చే ఏడాది జనవరి 8, 9, 10 తేదీలలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు, ప్రణాళికా రచనలపై యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన పలువురు ప్రముఖలతో శుక్రవారం రాత్రి నిర్వహించిన తొలి సమావేశంలో చర్చించారు. ఈ ఏడాది జనవరి 4 నుంచి ఐదు రోజుల పాటు జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలను స్ఫూర్తిగా తీసుకుని, వీటిని మరింత వైభవంగా నిర్వహించేలా సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఐదు రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, కేంద్ర మంత్రులు, తెలుగు రాష్ట్రాల నుంచి ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులతో పాటు సినీ ప్రముఖలు, దేశ, విదేశాలలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సభలకు హాజరుకానున్నారు. ఈ నెల 24న మరోసారి సమావేశమై, కమిటీల ఏర్పాట్లపై పూర్తిస్థాయిలో నిర్ణయాలు తీసుకోనున్నారు. సమావేశంలో వైస్ చాన్సలర్ డాక్టర్ యు. చంద్రశేఖర్, డైరెక్టర్ ఎం.శ్రీనివాస రావు, సాహితీవేత్తలు విశ్వనాథ గోపాలకృష్ణ, ఎర్రాప్రగడ రామకృష్ణ, అడ్వకేట్ శ్రీనివాసరావు, నన్నయ వర్సిటీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ పి.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగపరుస్తూ, నేరాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తతో ఉండాలని రాజమహేంద్రవరం సీఐడీ ప్రాంతీయ కార్యాలయం అడిషనల్ ఎస్పీ ఆస్మా ఫర్హీన్ అన్నారు. స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీటిపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండడం ద్వారా ఈ నేరాలను అదుపులో ఉంచవచ్చన్నారు. సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, జరిగితే ఏ విధంగా స్పందించాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ముఖ్యంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో వ్యక్తిగత ఫొటోలు, సమాచారం అప్‌లోడ్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కేవైసీల పేరిట వచ్చే ఫోన్లకు స్పందించి ఇతరులకు బ్యాంకు అకౌంట్ల వివరాలు, ఓటీపీలు చెప్పవద్దన్నారు. సైబర్ క్రైమ్‌లో సొమ్ములు పోగొట్టుకుంటే సత్వరమే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలన్నారు. లేకుంటే ఎన్‌సీఆర్పీ పోర్టల్, సైబర్‌క్రైమ్.జీవోటీ.ఇన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో జాబ్‌లంటూ కేటుగాళ్లు చేసే మోసాలు, టాస్క్ బేస్డ్ ఫ్రాడ్‌లు, డిజిటల్ అరెస్టులు ఎలా జరుగుతాయో వివరించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సీఐడీ సిబ్బంది ×డిజిటల్ అరెస్ట్¤ పేరిట నాటికను ప్రదర్శించి, విద్యార్థులను చైతన్యపరిచే ప్రయత్నం చేశారు. అనంతరం పోస్టర్స్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సైబర్ క్రైమ్ డీఎస్పీ వై.శ్రీనివాస్, సీఐ సీహెచ్. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం : మహిళల ఆందోళన

రాజమహేంద్రవరం రూరల్: తమ ఇళ్ల వద్ద మద్యం షాపు వద్దంటూ బొమ్మూరు కలువలచెరువు ప్రాంతానికి చెందిన మహిళలు శుక్రవారం ఆందోళన చేశారు. రెండు రోజుల క్రితం కలువలచెరువు వెనుక గతంలో నిర్వహించిన ప్రభుత్వమద్యం దుకాణంలోనే ప్రైవేటు వ్యక్తులు మద్యం షాపు ఏర్పాటు చేశారు. దుకాణాన్ని పెద్దగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుండడంతో మహిళలు ఆందోళన చేపట్టారు. గతంలోనే తమ అభ్యంతరాలతో తొలగిస్తామన్నారని, ఇక్కడ దుకాణాన్ని మళ్లీ ఏర్పాటు చేస్తే స్థానిక మహిళలు తిరిగే పరిస్థితి లేదన్నారు. వెంటనే దుకాణాన్ని తొలగించకుంటే ఆందోళన చేస్తామని, కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామని రెండు గంటల పాటు మద్యం విక్రయాలను అడ్డుకున్నారు.


మద్యం షాపు వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు